క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

సామర్లకోట: స్థానిక సత్యనారాయణపురం, జయలక్ష్మి థియేటర్ రోడ్డులో ఆదివారం ఉదయం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకుడు విన్నకోట సురేష్ తెలిపారు. బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేయనున్నట్టు తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి శిబిరం ఉంటుందని, రోగులు ఎటువంటి ఆహారం తీసుకోకుండా బీపీ, సుగర్ పరీక్షలకు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 98664 11346కు సంప్రదించాలన్నారు.

దాతల సహకారంతో బస్ షెల్టర్ నిర్మాణం

సామర్లకోట: పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే ప్రసన్నాంజనేయస్వామి ఆలయం, జగనన్న కాలనీరోడ్డులోని సీబీఎం సెంటర్‌లో దాతలు బస్ షెల్టర్లను నిర్మాణం చేశారు. వీటిని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబులు ప్రారంభించారు. చలికి సూర్యనారాయణ జ్ఞాపకార్థం అతని కుమార్తెలు సుమారు రూ.ఆరు లక్షల వ్యయంతో బస్సు షెల్టర్లను నిర్మించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, కౌన్సిలర్ బలుసు వాసు, జనసేన నాయకుడు సరోజ్ వాసు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

రౌతులపూడి: ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ వెంకటేశ్వరరావు సూచించారు. మండలంలోని ఎస్.అగ్రహారం, డీజే పురం సెంటర్లలో శనివారం సిబ్బందితో కలసి వాహనాలు తనిఖీ చేపట్టారు. పలు వాహనాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. వాహనాల రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరికీ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు.

ముగ్గురు పేకాటరాయుళ్ల అరెస్టు

మండలంలోని సబ్‌ప్లాన్ ఏజెన్సీ ప్రాంతం జల్దాం శివారు చాకిరేవులపాలెంలో పేకాట శిబిరంపై పోలీసులు శనివారం దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.4200 స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్టు తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

కరప: గొడ్డేటిపాలెం గ్రామానికి చెందిన కల్యాణీలక్ష్మి(40) భర్త పేరూరి శ్రీనివాస్ తనకు మద్దతుగా మాట్లాడలేదని మనస్తాపానికి గురైన పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కరప ఎస్సై టి.సునీత తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 13వ తేదీన కల్యాణీలక్ష్మి పెద్దకుమారుడు జోసెఫ్ నవీన్‌కుమార్ ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి సాయంత్రం తిరిగివచ్చాడు. ఈ విషయమై కొడుకును ఎక్కడి వెళ్లావని తల్లి మందలించగా తల్లిపై కుమారుడు అగౌరవంగా మాట్లాడాడు. ఈ విషయమై తండ్రి శ్రీనివాస్ కొడుకును సపోర్టు చేస్తూ మాట్లాడడంతో మనస్తాపానికి గురైన కల్యాణీలక్ష్మి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. వాంతులు చేసుకుంటున్న ఆమెను భర్త కాకినాడలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. భర్త పేరూరి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప ఎస్‌ఐ టి.సునీత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ ప్రారంభోత్సవం

తుని రూరల్: మండలంలోని వల్లూరులో దాతల సహకారంతో నిర్మించిన శ్రీలక్ష్మీ గణపతి ఆలయ ప్రారంభోత్సవం శనివారం వైభవంగా జరిగింది. గ్రామానికి చెందిన కొత్తూరు ప్రకాశరావు కుమారుడు తేజో భాస్కరరావు దంపతులు ఆలయాన్ని నిర్మించారు. దాతలు, గ్రామస్తుల ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు, శాంతి హోమం, పూర్ణాహుతి నిర్వహించి ఆలయ ప్రవేశం చేశారు. శ్రీలక్ష్మీ గణపతి విగ్రహాలను ధాన్యరాసులలో ఆవాహనం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు భాగస్వాములు అయ్యారు. ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్టు అర్చకులు తెలిపారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ

బోట్‌క్లబ్: స్థానిక టౌన్ హాల్‌లో పనిచేస్తున్న సిబ్బంది పిల్లలు 33 మందికి శనివారం స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టౌన్‌హాల్ కార్యదర్శి పాబోలు చిన్న పున్నయ్య మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహణకు టౌన్ హాల్ కమిటీ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. పాఠశాల విద్యను అభ్యసిస్తున్న 33 మంది బాలికలకు ఫీజుల నిమిత్తం రూ.70 వేలు అందజేశామన్నారు. ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలు నిర్వహించుకోవడం ఒక ఆనవాయితీగా పెట్టుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు నానాజీ ఉపాధ్యక్షుడు గోలి రఘునాథ్, సంయుక్త కార్యదర్శి వీవీ సుబ్రహ్మణ్యం, కోశాధికారి సూర్యనారాయణ రాజు, కమిటీ సభ్యులు నెక్కంటి శ్రీనివాస్, పెద్దిరెడ్డి సతీష్, సుసర్ల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రేపటి నుంచి సామవేదం ప్రవచనాలు

బోట్‌క్లబ్: సరస్వతీ గాన సభ ఆధ్వర్యంలో సోమవారం నుంచి 22వ తేదీ వరకూ సమన్వయ సరస్వతీ సామవేదం షణ్ముఖశర్మ ప్రవచనాలు జరుగుతాయని నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యకళామందిరంలో ప్రతిరోజు సాయంత్రం 6.30 గంటలకు ఈ ప్రవచనాలు ప్రారంభమవుతాయన్నారు.

ఇవండీ సంగోతులు !


అధ్వానంగా తయారైన చదలాడ-ఉలిమేశ్వరం రహదారి


చదలాడ-ఉలిమేశ్వరం రహదారిలో గుంతల్లో చేరిన వర్షపునీరు

- అధ్వానంగా ప్రధాన రహదారులు
- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు

పెద్దాపురం: రహదారులు గోతులమయంగా మారాయి. పెద్ద పెద్ద గుంతలు, కంకర రాళ్లతో అధ్వానంగా ఉన్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి అధికారం చేపడితే రహదారులు మారుపోతాయి. అడుగు నేలపైన పెట్టకుండా, తడవకుండా, గోతిలో పడకుండా రహదారులకు ప్రాధాన్యతనిస్తారనుకున్న నియోజకవర్గ ప్రజల ఆశల అడియాశలయ్యాయి.

మండలంలోని ప్రధాన రహదారులు ప్రమాదాలకు తావిచ్చేలా ఉన్నాయి. గత కొన్నేళ్లుగా రోడ్లు కనీస మరమ్మతులకు నోచుకోకపోడంతో భారీ గుంతలు ఏర్పడి వర్షం వస్తే చెరువు తలపిస్తున్నాయి. కంకరరాళ్లు తేలడంతో రహదారిపై వెళుతున్న ఆటోలు, ఇతర వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి.

అధ్వానంగా ప్రధాన రహదారులు

నిత్యం రద్దీగా ఉండే పిఠాపురం-దివిలి ప్రధాన రహదారిలో స్థానిక మండల పరిషత్ పాఠశాల సమీపంలో గుంతలు పడడంతో ప్రయాణికులకు నరకం చూస్తున్నారు. చినుకు పడితే గోతులలోకి నీరు చేరి చెరువును తలపిస్తోంది. దీంతో భారీ వాననాలు చాలా జాగ్రత్తగా రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఇక ఆటోల్లో ప్రయాణించేవారు, ద్విచక్ర చోదకులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. అదే విధంగా పులిమేరు-గుడివాడ, ఆర్‌బిపట్నం -చినబ్రహ్మదేవం, చదలాడ-ఉలిమేశ్వరం, గోరింట-పులిమేరు గ్రామాలకు వెళ్లే రహదారులు మరింత దారుణంగా ఉన్నాయి. రోడ్డు నిర్మాణాలను కొన్ని చోట్ల అసంపూర్ణంగా వదిలేయడంతో రాళ్లు పైకి తేలి ప్రయాణికులను బుడిద చుట్టిముడుతోంది. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్లకు శాశ్వత పరిష్కారం చూపించాలంటూ ప్రజలు కోరుతున్నారు.

అత్యవసర సేవలకు తిప్పలు

భారీ గుంతల కారణంగా అత్యవసర సేవలందించే 108 వాహనాలు సకాలంలో చేరుకోలేకపోతున్నాయి. రోడ్ల గోతులతో అస్తవ్యస్తంగా మారినప్పటికీ ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు ఆయా రహదారులు నిర్మాణానికి నోచుకోకపోవడంతో గ్రామస్తులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

భయం భయంగా ప్రయాణాలు

దివిలి నుంచి పిఠాపురం రహదారిలో చాలా గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణిస్తుంటారు. ఈ రోడ్డులో దివిలి ఎంపీయూపి స్కూల్ సమీపంలో పెద్ద గుంత ఉంది. వాహనదారులు నిత్యం చిక్కుకుని ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్షం కురిస్తే ప్రయాణాలు చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోంది.


గోతుల్లో నీరు చేరి ప్రమాదకరంగా ఉన్న ఆర్‌బీపట్నం-మేడపాడు రహదారి

నిత్యం ప్రమాదాలు



దివిలి జంక్షన్‌కు వాహనాల రాకపోకలు ఎక్కువ ఉంటాయి. పిఠాపురం రోడ్డులో ఉన్న పెద్ద గుంత కారణంగా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా పట్టించుకునే నాథుడులేడు. కొన్ని రహదారుల్లో చాలా చోట్ల పెద్ద గోతులు పడడంతో ఆ రోడ్డుపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

– వట్టికూటి రాజ్‌కుమార్, స్థానిక యువకుడు, దివిలి, పెద్దాపురం మండలం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



రహదారుల్లో ఏర్పడిన గుంతలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దివిలి గ్రామస్తులు దీనిపై పంచాయతీలో ఫిర్యాదు చేశారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. సమస్యను సంబంధిత శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం.

– నక్కా సత్యనారాయణమూర్తి, పంచాయతీ కార్యదర్శి దివిలి

ప్రజలకు అండగా ఉండాలి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీత

పిఠాపురం: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజల తరఫున పనిచేసి వారికి అండగా ఉండాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీత సూచించారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పిఠాపురం మండలానికి నూతనంగా నియమితులైన పార్టీ మండల కమిటీ, అనుబంధ విభాగాల నాయకులు శనివారం పిఠాపురం పార్టీ కార్యాలయంలో ఆమెను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ విభాగాల్లో నిష్ణాతులైన నాయకులు, కార్యకర్తలను అధ్యక్షులుగా నియమించడం ద్వారా పార్టీపై నాయకుల్లో నమ్మకం, విశ్వాసం పెరిగాయన్నారు. నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో పార్టీని ముందుకు నడిపించి ప్రజల్లో పార్టీ పట్ల నమ్మకాన్ని పెంచాలన్నారు. ప్రతిఒక్కరూ పార్టీ సూచించిన కార్యక్రమాల్లో పాల్గొని ప్రజల తరఫున పోరాటాలకు సిద్ధంగా ఉండాలన్నారు. పార్టీ పిఠాపురం మండల కమిటీ ఉపాధ్యక్షుడు పసుపులేటి చైతన్య కుమార్, చింతాడ రాంబాబు, ప్రధాన కార్యదర్శులు వెన్నపు బుల్లబ్బాయి, రెడ్డి పార్థసారథి, వెనుగంటి సుబ్బారాయుడు, పీటల ప్రవీణ్, కార్యదర్శులు గరగ మహేశ్వరరావు, కొప్పన సోమరాజు, కేశవరపు త్రిమూర్తులు, దడాల వీర్రాజు, గట్టి బుల్లి రాజకుమార్, మండల సభ్యులు తుమ్మలపల్లి నాని, తమ్మనబోయిన అయ్యన్న, బస్వా వీరబాబు, దడాల అప్పన్న, పెద్దింటి సురేష్ రెడ్డి, ఎరిగెల ప్రసాదరావు, కె.సునీల్‌దత్తా, చక్రవర్తుల సత్తిరాజు, కురాకుల విష్ణుమూర్తి, చెల్లి రమేష్, రాజాల చక్రం, పెదిరెడ్ల శ్రీనివాసరావు తదితరులు ఆమెకు కృతజ్ఞతలు తెలపారు. పిఠాపురం మండల యూత్ విభాగం అధ్యక్షుడు పైలా సన్యాసినాయుడు, మహిళా విభాగం రాసంశెట్టి భవాని, రైతు విభాగం బండి వెంకట సుబ్బారావు, బీసీ, ఎస్సీ, ఎస్టీ సెల్ అధ్యక్షులు రాయుడు చిన్ని, మహీంద్రవాడ సింహాచలం, వల్లపు నాగేంద్ర, క్రిస్టియన్ మైనారిటీ విభాగం వేమగిరి సోమరాజు, స్టూడెంట్ వింగ్ పల్లిక అజయరాజా, పంచాయతీ రాజ్ వింగ్ ముద్దా నానిబాబు, ఆర్టీఐ వింగ్ కర్రి కృష్ణంరాజు, వలంటీర్ వింగ్ కందా దుర్గారావు, వీవర్స్ వింగ్ మావూరి శంకరరావు, వాణిజ్య విభాగం ఓలేటి పాపిరెడ్డి, కల్చరల్ వింగ్ మేళం శ్రీనివాసరావు, సోషల్ మీడియా వింగ్ పరసా మణికంఠ, పబ్లిసిటీ వింగ్ కె. మహేశ్వరరావులు ఆమెను కలిశారు. తమకు పదవులు ఇవ్వడం ద్వారా బాధ్యతను పెంచారని, శక్తి వంచన లేకుండా పని చేసి పార్టీ పటిష్టతకు పాటుపడతామని చెప్పి ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. వారందరికీ ఆమె అభినందనలు తెలిపారు. అందరం కలిసి ప్రజల తరఫున పని చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.


వంగా గీతకు కృతజ్ఞతలు తెలుపుతున్న నాయకులు


నాయకులను ఉద్దేశించి మాట్లాడుతున్న వంగా గీత

సీహెచ్‌సీలో తనిఖీలు


గోకవరం సీహెచ్‌సీలో తనిఖీలు చేస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సరిత

గోకవరం: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తూర్పుగోదావరి జిల్లా డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ పి.సరిత శనివారం తనిఖీ చేశారు. మండలంలో సీజనల్ జ్వరాలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో ఉన్న ఇన్‌పేషెంట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీజనల్ జ్వరాలపై ఫీల్డ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రజలకు జ్వరాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కొత్తపల్లి వైద్యురాలు డాక్టర్ నిఖిత గ్రామంలో నిర్వహిస్తున్న గృహ సందర్శనను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాస్, ఏఎన్ఎం నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మురుగునీరు పోయేదెలా!


హుస్సేన్‌పురం వద్ద గోదావరి కాలువలో గుర్రపు డెక్క తొలగింపు

- గుర్రపు డెక్క తొలగించి గట్టుపైనే వదిలేస్తున్న అధికారులు
- రోడ్డుపై నిలిచిపోతున్న వర్షపు నీరు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

సామర్లకోట: స్థానిక గోదావరి కాలువలో తొలగిస్తున్న గుర్రపు డెక్క, తూటి కాడలను రోడ్డు మార్జిన్‌లోనే వేస్తున్నారు. దీనివల్ల రోడ్డుపై చెత్త పేరుకుపోవడంతో పాటు వర్షాలు వచ్చిన సమయంలో నీరు రోడ్లపైనే నిలిచిపోతుంది. దీని కారణంగా వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. పీబీ దేవం నుంచి సామర్లకోట వరకు గుర్రపుడెక్క, తూటికాడ తొలగింపు పనులను ఇరిగేషన్ ఆధ్వర్యంలో సుమారు 10 రోజుల నుంచి నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా హుస్సేన్‌పురం గ్రామం వద్ద గోదావరి కాలువలో తొలగించిన చెత్తను రోడ్డు మార్జిన్‌లోనే వేస్తున్నారు. ఈ చెత్త వేయడం వల్ల వర్షపు నీరు కాలువలోనికి పోయే మార్గంలేక రోడ్డుపైనే నిలిచిపోతోంది. దీంతో సామర్లకోట నుంచి కెనాల్ రోడ్డులో ఉన్న బీటీ రోడ్డు పాడైపోతుందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోదావరి కాలువ నుంచి తొలగించిన తూటి కాడను మరో ప్రదేశానికి తొలగించేలా ఏర్పాటు చేయాలనిహుస్సేన్‌పురం గ్రామస్తులు కోరుతున్నారు. బీటీ రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోవడంతో భారీ వాహనాల రాకపోకల సమయంలో తారు లేచిపోయి చిన్నచిన్న గోతులు పడుతున్నాయని, అవి క్రమేపీ పెద్ద గోతులుగా మారిపోతున్నాయని హుస్సేన్‌పురం గ్రామస్తులు వాపోతున్నారు. గతంలో ఇదే పరిస్థితి ఏర్పడి హుస్సేన్‌పురం కాలిబాట వంతెన నుంచి ప్రధాన గ్రామం వరకు రోడ్డు గోతులతో నిండిపోయి తరచూ ప్రమాదాలు జరిగేవని గ్రామస్తులు గుర్తు చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో హుస్సేన్‌పురం గ్రామం వద్ద రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు.


గోదావరి కాలువ వెంబడి రోడ్డు మార్జిన్‌లో వేసిన చెత్త

కాలువ గట్టుపై వేయడంతో..

దీనిపై ఇరిగేషన్ జేఈ సైనీని వివరణ కోరగా గోదావరి కాలువ గట్టు తమకు సంబంధించినదని, ఆ ప్రదేశంలోనే తూటికాడ, గుర్రపు డెక్కను వేస్తున్నామని తెలిపారు. రోడ్డు మార్జిన్‌లో వేసిన చెత్తను తొలగించడానికి తమ వద్ద ప్రొవిజన్ లేదని తెలిపారు. రోడ్డుపై నీరు గోదావరి కాలువలోనికి వచ్చే అవకాశం లేదని, మురుకు కాలువలు ఉన్నాయని పొంతన లేని సమాధానం చెబుతున్నారు. ఈ రోడ్డుకు ఒకవైపు మురుకు కాలువ ఉండగా మరోవైపు గోదావరి కాలువ ఉంది. ఇటువైపు నీరు మురుకు కాలువలోనికి ఏవిధంగా వెళుతుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.


తొలగించిన చెత్తను రోడ్డు మార్జిన్‌లో వేస్తున్న సిబ్బంది

భక్తి శ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు

సామర్లకోట: కృష్ణాష్టమి వేడుకలు పట్టణ, మండల ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పట్టణ పరిధిలో పాత సామర్లకోటలో ఉన్న వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామివారికి తెల్లవారు జామున అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద ఉన్న పాండురంగ స్వామి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. పెద్దాపురం రోడ్డులో విఘ్నేశ్వరీ థియేటర్ ఎదురుగా ఉన్న రాధా వేణుగోపాలస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు శనివారం ప్రారంభించారు. భక్తులకు కౌన్సిలర్ నమ్మి సూర్య దుర్గ, ఆలయ కమిటీ నాయకులు నమ్మి శ్రీనివాసు, దారబాల సూరిబాబు, మార్ల సూర్యనారాయణ, మార్ల రాంబాబు, నమ్మి అప్పారావులు భక్తులకు సేవలందించారు. ఆదివారం ప్రత్యేక పూజలు అనంతరం వివిధ రకాల దేవతామూర్తుల వేషధారణలతో ఊరేగింపు జరుగుతుంది. అదే విధంగా బ్రౌన్‌పేట కృష్ణుని ఆలయం వద్ద కౌన్సిలరు పిట్టా సత్యనారాయణ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. బలుసుల పేటలోని ఆలయంలో వ్యవసాయ కూలీ సంఘం అధ్యక్షుడు లింగం శివప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పేదలకు వస్త్రదానం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నేతల హరిబాబు, మాజీ కౌన్సిలర్ నేతల వెంకటలక్ష్మి, ఆలయ కమిటీ నాయకులు సలాది భీమేశ్వరరావు, బొద్దు చిన్ని, నాగేంద్రలు సేవలందించారు. స్థానిక చిన్న వీధిలో ఉన్న రామాలయంలో సానిపిని హరి ఆధ్వర్యంలో రాధా కృష్ణుల విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు.

పెద్దాపురంలో..

పెద్దాపురం: మండలంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక పాత బస్టాండ్ కృష్ణుడి గుడి వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రుక్మిణీ కల్యాణ వైభవోపేతంగా చేశారు. గుడివాడ శ్రీకృష్ణాశ్రమంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం భారీ అన్నదానం చేశారు. స్థానిక సత్తిరెడ్డిపేట భగవద్గీతాలయంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భగవద్గీత ప్రచార సమితి వ్యవస్థాపకులు మల్లికార్జున స్వామి భగవద్గీత పారాయణం నిర్వహించి ఆధ్యాత్మిక ప్రసంగం అందించారు. పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కాండ్రకోట నూకాలమ్మ ఆలయం వద్ద ఉన్న కృష్ణాలయం వద్ద కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు ఆలయం వద్ద పూజల్లో పాల్గొనగా పలువురు దంపతులు పీటలపై ఆశీనులై రుక్మిణీ కల్యాణం నిర్వహించారు. అనంతరం ఉట్టు కొట్టు కార్యక్రమం నిర్వహించగా వందల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఇస్కాన్ టెంపుల్‌లో వేడుకలు

సామర్లకోట: అచ్చంపేట గ్రామంలో ఉన్న ఇస్కాన్ టెంపుల్‌లో శనివారం ఉదయం నుంచి కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ఈ మేరకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆధ్యాత్మిక ప్రసంగాలు నిర్వహించారు. కృష్ణుడు, గోపికల వేషదారణలతో కోలాటంతో అలరింప చేశారు. నిర్వాహకులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు.


సామర్లకోట బలుసుపేటలోని కృష్ణుని ఆలయంలో భక్తులు


గుడివాడ వేడుకల్లో ఉట్టి కొడుతున్నచిన్నారులు



కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

సామర్లకోట: కృష్ణాష్టమిని పురస్కరించుకొని శనివారం ఆలయాలు భక్తుల సందడితో కిటకిటలాడాయి, అనేక ప్రాంతాల్లో చిన్నారులకు కృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. దాంతో పిల్లలు ఉన్న ప్రతి ఇంటిలోను సందడి నెలకొంది. స్థానిక సత్యనారాయణపురానికి చెందిన చింతల మోక్షిత్ కృష్ణుడు, పోతిరెడ్డి అన్వికకు గోపిల వేషధారణలో ఆకట్టుకున్నారు.


అచ్చంపేట ఇస్కాన్ ఆలయంలో కృష్ణుడు, గోపికలు

రహదారి నిర్మించాలంటూ ధర్నా

ఏలేశ్వరం: ఏజెన్సీ ముఖద్వారమైన ప్రధాన రహదారిని పునర్నిర్మించాలని కోరుతూ రమణయ్యపేటలో శనివారం యువకులు ధర్నా చేశారు. ఏలేశ్వరం నుంచి ఏజెన్సీ వెళ్లేకి ఈ రహదారి మీదుగా అడ్డతీగల, వై.రామవరం, రాజవొమ్మంగి, గంగవరం, రంపచోడవరం మండలాలతో పాటు నర్సీపట్నం మీదుగా విశాఖపట్నం వరకూ రాకపోకలు సాగుతాయి. ఈ రహదారిపై పెద్దగుంతలు ఏర్పడడంతో వర్షపు నీరు గోతుల్లోకి చేరి రాకపోకలు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగించే వాహనదాడులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో జె.అన్నవరంతో పాటు పలు గ్రామాలకు చెందిన యువకులు ప్రధాన రహదారిపై ధర్నా చేసి నిరసన తెలిపారు. సంబంధిత అధికారులు వచ్చే వరకు ధర్నా ఆపేది లేదని భీష్మించారు. దీంతో రహదారి పొడువున ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు జోక్యం చేసుకోవడంతో ఎట్టకేలకు ధర్నా విరమించారు. కార్యక్రమంలో పలువురు యువకులు పాల్గొన్నారు.


రమణయ్యపేట వద్ద రహదారిపై ధర్నా చేస్తున్న యువకులు